# సామాన్య ప్రత్యసూత్రాలు

ఏడ్చేవాళ్ళని చూసి నవ్వుతాం. నవ్వేవాళ్ళని చూసి ఏడుస్తాం. ఏడుపు లేకుండా చేయటం అసాధ్యం. ఎందుకంటే ఒక పిల్లాడ్ని వూరుకో బెట్టేసరికి మరో పిల్లో పిల్లాడో ఏడుపుకి లంకించుకున్నట్లు లోకంలో దుఃఖం ఎక్కడో ఒకచోట ఎవరికో ఒకరికి కలుగుతూనే వుంటుంది. కలక్కమానదు. ఒకచోట ఆగితే అది మరొకచోట పుడుతుంది. అది దాని స్వభావం. ఏడుపులాటిదే నవ్వు. ఎవరో ఒకరు నవ్వుతారు. నవ్విస్తారు. నవ్వుతూ వుంటారు ఏడవలేక. కాఫీ కషాయం పాలూ పంచదారతో కలిసి ఒక మిశ్రమ పానీయం తయారయినట్లు జీవితం సుఖ దుఃఖాల మిశ్రమ కషాయం కావాలి. పాలు తాగితే మంచిదే. అందరికీ పాలు దొరకవు కదా! అలాగే డికాక్షన్ మాత్రమే సేవించి సరిపుచ్చుకోవలసి నట్లు వుంటాయి కొందరి జీవితాలు. ఈ సుఖ దుఃఖాలు కలగకపోతే మనం యీ లోకంలో జీవిస్తున్నట్లు దాఖలా లేమీ వుండవు.


ప్రేయసితో సంతోషంగా గడపాలనుకునే వాడు పెళ్ళాల్ని ఏడిపించక తప్పదు. త్రాగితే తప్పేముంది అనుకునేవారు త్రాగని వారికి న్యూసెన్సీ కలుగచేస్తారు. విమానంమీద వెళ్ళే వారి ఖర్చు భూమ్మీద వుండేవారు భరించవలసి వస్తుంది. ఒకరి సుఖం ఒకరి సంతోషం మరొకరికి దుఃఖం లేకుండా ఎప్పుడైనా వుందా? అంచేత నవ్వటానికి ధైర్యం

కావాలి. నవ్వించే వారు చాలా కరేజియస్ పీపులయి వుంటారు. మూతి ముడుచుకు కూర్చునే వారిని నవ్వించటానికి ప్రయత్నించండి. ఎన్ని డాలర్లు ఖర్చవుతుందో మీకే తెలిసి వస్తుంది. మెచ్చగా పడుకోవటం, కమ్మగా భోంచేయటం, సంతోషంగా వుండటం కోసం మనిషికెన్నయినా పాట్లు పడతాడు. అవి లభించకపోతే మనిషికి దుఃఖం కలుగుతుంది. కాని ఆ పాట్లను తల్చుకుంటే దానికి కల కారణాలను వెతికితే మనకు నవ్వు వస్తుంది. దుఃఖంలోంచి వచ్చిన నవ్వు బురదలోంచి పుట్టిన పువ్వు.

నవ్వితే కన్నీళ్ళొస్తాయి కదా. కన్నీళ్లు ఉప్పగా వుంటాయి. ఉప్పు సముద్రంలో వుంటుంది. సముద్రంలాటి జీవితం నుండి రాలే కన్నీటి బొట్లు ఉప్పగా వుండటంలో ఆశ్చర్యం ఏముంది? చిదిమిన పాల్గారు చెక్కుటద్దములు అన్నారు మనవాళ్లు చిదిమితే పాలు కారడమేవిటో ఆ మిస్టరీ ఎంతకీ బోధపడకుండా వుంది. చిదిమితే పాలు కారడం అనేది లేదు. కనుక అశాస్త్రీయం పాలు కారినట్లు అనిపించవచ్చు. అది మనస్సుకి సంబంధించినది గనుక రమ్యమైనది. ఏదో జీవిస్తున్నాం అనుకుని వూరు కుంటే సరిపోదు. గోలచేస్తేనేకాని జీవిస్తున్నట్లు రుజువుకాదు. జీవిత మంటే గోల. అందుకే జీవితం గురించి ఎన్నో విషయాలు మాటల్లో బయటపడతాయి. నోరెందుకు పెట్టాడు దేవుడు? దాంట్లో మళ్ళీ నరంలేని నాలుక ఎందుకు? (కమాన్ టెల్ సంథింగ్ ఎబవుట్ లైఫ్ — జీవితం గురించి ఏదో ఒకటి చెప్పు. చెప్పాలి తప్పదు) నోరు వున్నది. ఇడ్లెన్నో ఉప్మాలు నానారకాల పదార్థాలు బొక్కటానికిమాత్రమేకాదు. జీవితం గురించి నోరు తెరిచి మాట్లాడటానికి. ఏడ్చినపుడు ముక్కూ నోరూ కళ్ళూ అన్నీ ఏకమవుతాయి. గుండె బరువెక్కుతుంది. మెదడు వేడెక్కుతుంది. వీపు మీద గిల్లితే నోట్లోంచి అమ్మా అని ఎందుకు రావటం? అక్కడే వుంది విచిత్రం. మనుష్యుల్ని తినేసేట్లు చూస్తారు కొంతమంది. తినటమనేది గ్రహించటం అన్నమాట చేతుల్లో మనిషిని దగ్గరకు లాక్కుంటాం. చేతుల్తో యిష్టమైన వస్తువులన్నీ (తినేసి) నోట్లోకి తోస్తాం. చేతుల్తో అడ్డమైన వెధవ పన్లన్నీ చేస్తాం. చేతులు గ్రహించటానికేగాక యివ్వ టానికి కూడా వున్నాయని మనం గ్రహించం. చాలా మందికి ఈ లోక

మంతా తమ కోసం ముగ్గిన అరటిపళ్ళ గెలలా, పండిన పనస పండులా, పరువానికొచ్చిన పిల్లలా అనుభవించటాని కుందని అనుకుంటారు. లోకం తమకోసమనుకునే వారికంటె తాము లోకం కోసం అని జీవించే వారి సంఖ్య తగ్గటం వలన ప్రమాదాలు హెచ్చుగా జరుగుతున్నాయి.

లోకంలో సంతోషాన్ని ప్రసారం చేయటానికి ఒకే ముఖ్యసూత్రం వుంది. అది యివ్వగలగటం ఏదైనాసరే ఆఖరికి చిరునవ్వైనా సరే యివ్వ



గలగాలి. సహాయం చేయటం కోసమే చేతులున్నాయి అని మనం జ్ఞాపకం వుంచుకోవాలి. ఎవరికైనాసరే తోడ్పడే అవకాశం వస్తే పప్పులో గరిటలా జారిపోకూడదు. చాలా తొందర పనులున్నాయి తరువాత కలుద్దామని నంగి మాటలు చెప్పకూడదు. అవకాశం దొరికితే సహాయం చేసి తీరాలి ఎవరికైనా ఏ సందర్భంలోనైనాసరే, సహాయం చేయటం వలన మన ఉనికి సార్థకమవుతుంది. ట్వంటీఫోరవర్సూ తన బాగు కోసమే జీవించే డబ్బు నేతగాళ్ల (మనిస్పిన్నర్స్) వలన లోకంలో దుఃఖం పెరిగిపోతోంది. మంచికి కీడూ చెడుకి సహాయం చేయకూడదు గదా? నేను మా వారితో అంటుంటాను "మనం మనుషులమని రుజువు చేసుకోడానికి వచ్చే అవకా

శాల్ని జాడవిడువకండి" అని ఇప్పుడు మనం కాదంటావా అన్నట్లు అయో మయంగా చూస్తారు. అవసరానికి కూర్చున్న చోట నుంచి లేవలేని వాళ్ళు మనుష్యు లెట్టాగవుతారు? తల్లికి గర్భధారణ ప్రసూతి బాధల్ని కలిగించిన వారేతప్ప వారు మనుష్యు లెట్లాగవుతారు! కారెంత మాత్రం కారు.

అంచేత రోజూ ఒక మంచిపని చేయాలని మేంప్లానువేసుకున్నాం. మా వీధిలో ఒక కుర్రాడు లాంతరు స్తంభందగ్గర నిలబడి ఏడుస్తుంటే మా వారు వాణ్ని పోలీసు స్టేషనులో కప్పగించి వచ్చారు. వాళ్ళ యింటిగుమ్మం దగ్గర నిలబడిన కుర్రాడ్ని రిక్షాలో వేయించుకొని వాడికి బిస్కట్లు, మిఠా యిలు కొనిపెట్టి స్టేషన్‌లో దిగబెట్టడానికి మా వారికి నాల్రూపాయలైంది. పోలీసువాళ్ళు ఆ పిల్లవాడి తాలూకువాళ్లు మావార్ని తలవాచేలా చివాట్లు పెట్టారు. నీ కిదేం పోయేకాలమని. ఆ మర్నాడు మా వారు ఒక పంపు దగ్గర నీళ్ళబిందె ఎత్తుకోలేక అవస్థ పడుతున్న అమ్మాయికి సాయం చేయ బోయారు. ఆ అమ్మాయి బిందెడు నీళ్ళూ మా వారిమీద వంపేసి పరిగెత్తు కుని యింట్లోకి పారిపోయి తన రెండో పెళ్ళి మొగుడ్ని వీధిలోకి తీసు కొచ్చింది. వాడికి అయిదురూపాయలిచ్చి వూరుకో బెట్టాల్సి వచ్చింది. నేను మా పక్కవాటా వారు దండెం మీద ఆరేసుకున్న రవిక క్రిందపడితే వారి కిద్దామని తీస్తుండగా ఆ ఇల్లాలు రంయ్ రంయ్ మంటూ వచ్చి ఇదివరకు రెండు జాకెట్లు యిల్లాగే పోయాయి అవి కూడా తెమ్మని నా మీద దాడి కొచ్చింది. మా పొరుగింటి బామ్మగారికి కళ్లు కనపడవు. ఆవిడ నూతి పళ్ళెంమీద జారిపడబోతుంటే పట్టుకుంటే మడి చెడగొట్టానిని మళ్ళీ స్నానంచేసి నన్ను తిట్టింది. మా పేటలో ఆస్పత్రిలో పేషంట్లకు పూలిద్దా మని ఒకరోజు మేము పూలగుత్తులు కొనుక్కొని ఆస్పత్రి కెళ్ళితే నన్నూ మావారినీ చివాట్లు పెట్టింది. ఆస్పత్రిలోకి దొంగలు యిలాగేవచ్చి పేషంట్ల తాలూకు సామాన్లను అపహరిస్తున్నారంటూ. పోస్టాఫీసు దగ్గర మావారు ఉత్తరాలు మనిఆర్డర్లు రాసిపెట్టి ఒక పార్కరుపెన్ను పోగొట్టుకున్నారు. రిక్షాలోంచి దిగలేక అవస్థపడుతున్న ఒక నిండు గర్భిణికి చేయూత నివ్వ బోయి మావారు రోడ్డుమీద అలా చేయూత నివ్వని పెద్ద మనుషుల చేత

చివాట్లు తిన్నారు. మా పక్క వీధిలో ఒకాయనకు రోగం వచ్చి తిరగబెట్టి యిప్పుడు తగ్గి కోలుకుంటున్నారని తెలిసి ఆయనకు ఏమైనా కథలు చదివి వినిపిద్దామని మేమిద్దరమూ వెళ్ళాం. ఆ ఇంటావిడ యిలాటివాళ్ళు చాలా మంది వస్తున్నారు. ఇప్పుడు చెయ్యీ్యరుకోలేదు పొమ్మంది, మేం నిర్ఘాంత పోయాం.

రోజుకో మంచి పనిచేయటానికి మేం ఎంత ప్రయత్నించినా విఘ్నేశ్వరుడి పెళ్ళికి వేయి నిఘాలులాగా మేము ఏ మంచిపనీ చేయలేక పోతున్నాం. రోజుకో మంచిపని చేయండి అన్న వాడెవడో కార్టూను గీసే వాడయి వుంటాడు. అవును భగవంతుడుమట్టుకు గొప్ప కార్టూనిస్టు ఎందుకు కాకూడదు? మనమంతా భగవంతుడి కార్టూనం.